# సాక్షి వనపర్తి

బుధవారం : 3 : సెప్టెంబర్ : 2025






## 'అమృత్' పనుల్లో వేగం

పాలమూరు, గద్వాల రైల్వేస్టేషన్లలో సాగుతున్న అమృత్ భారత్ పనుల్లో వేగం పెంచాలని ద.మ. డీఆర్ఎం సంతోష్‌కుమార్ వర్మ కోరారు.

-8లో ▸



## జూరాలకు తగ్గిన వరద

జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టడంతో మంగళవారం పది గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలారు.

-8లో ▸

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.4/22.4

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తిటౌన్: రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ప్రభుత్వ ఉద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్ఓ టి.సుధీర్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, క్రికెట్, చెస్, క్యారమ్స్, హాకీ, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, బెస్ట్ ఫిసిక్, ఖో–ఖో, యోగా, కబడ్డీ, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, షటిల్, లాన్ టెన్నిస్ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో హైదరాబాద్ ఎల్బీ స్టేడియం, జింఖానా గ్రౌండ్, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో పోటీలు జరగనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల క్రీడాకారులు 4వ తేదీ వరకు సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా యువజన క్రీడలశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



అమరచింత: ప్రజలకు మెరుగైన సేవలు, పాలన అందించడానికి అధికారులు కృషి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ కోరారు. మంగళవారం ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం సహాయనిధి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. కుటుంబంలో యజమాని మృతి చెందితే ప్రభుత్వపరంగా రూ.20 వేలు అందిస్తున్న విషయాన్ని గ్రామాల్లో టాంటాం వేయించాలని సూచించారు. సిబ్బంది హాజరు విషయంలో అలసత్వం వీడాలని.. సెలవులో ఉంటే రిజిస్టర్‌లో సీఎల్ వేయాలన్నారు. అనంతరం బీఎల్వోలతో మాట్లాడి ఓటరు జాబితా సవరణ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తహసీల్దార్ రవికుమార్, డీటీ తదితరులు ఉన్నారు.

**సకాలంలో సీఎంఆర్ అందించాలి..**


ఆత్మకూర్: రైస్‌మిల్లర్లు సీఎంఆర్ సకాలంలో ఎఫ్‌సీఐకి అందించాలని.. నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని శ్రీలక్ష్మి ఆగ్రోటెక్ రైస్‌మిల్‌ను జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీవిశ్వనాథ్‌తో కలిసి ఆకస్మికంగా సందర్శించి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2024–25 వానాకాలానికి సంబంధించిన సీఎంఆర్ అప్పగించేందుకు ఈ నెల 12 వరకు గడువు ఉందని, ఆలోగా చేర వేయాలని ఆదేశించారు. ఆయన వెంట అధికారులు నాగేంద్రం, తహసీల్దార్ చాంద్‌పాషా, అగ్రోటెక్ యజమాని రమేష్‌శెట్టి తదితరులు ఉన్నారు.

### అథ్లెటిక్స్‌లో 'ఉద్యాన' విద్యార్థి ప్రతిభ

కొత్తకోట రూరల్: పాలమూరు యూనివర్సిటీలో జరిగిన 11వ తెలంగాణ జూనియర్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మోజర్ల కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థి ప్రతిభ చాటారు. యూజీ మొదటి సంవత్సరం చదువుతున్న ఉదయ సిద్ధార్థ అండర్–20 షాట్‌పుట్ విభాగంలో జిల్లా నుంచి పాల్గొని రజత పతకం సాధించినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డా. పిడిగెం సైదయ్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని డీన్‌తో పాటు అధ్యాపక బృందం, తోటి విద్యార్థులు అభినందించారు. ఓఎస్‌పి డా. శంకర్‌స్వామి, షహనాజ్ గౌతమి, శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ మహేష్ పాల్గొన్నారు.

# పత్తి రైతు విలవిల

## అధిక వర్షాలతో దెబ్బతింటున్న పంటలు



అమరచింత శివారులో సాగు చేసిన పత్తి పంట

- సోకిన ఎండు, ఆకుమచ్చ తెగులు
- పూత, గూడ, కాయ రాలుతున్న వైనం
- ఎకరాకు రూ.35 వేల పెట్టుబడి
- జిల్లాలో 15,831 ఎకరాల సాగు

అమరచింత: ఇటీవల కురిసిన అధిక, ఎడతెరిపి లేకుండా వర్షాలతో పత్తి పంటకు ఎర్ర, పచ్చ తెగులు సోకడంతో పాటు పూత, పిందెలతో పాటు గూడు, కాయలు కూడా రాలుతున్నాయి. దీంతో పంట సాగుచేసిన రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఏడాది వర్షాకాలంలో జిల్లావ్యాప్తంగా 15,831 ఎకరాల్లో పత్తి సాగుకాగా.. ఎకరాకు సుమారు రూ.35 వేల పెట్టుబడి అయింది. కళ్ల ముందే ఆకులు రాలిపోవడం, కాండం మెత్తబడటం వంటి దృశ్యాలు చూస్తూ తమను గట్టెంకించవయ్యా అంటూ దేవుడిని వేడుకుంటున్నారు. పంట చేతికొచ్చేందుకు కేవలం నెల వ్యవధి ఉండగా ఇలాంటి పరిస్థితి ఎదురవడంతో తమకు నష్టాలే తప్పా లాభాలు ఉండవని రైతులు కలత చెందుతున్నారు.

**సాగు భారం..**

పత్తి సాగు ఎకరాకు రూ.35 వేల వరకు పెట్టుబడి అవుతుందని రైతన్నలు చెబుతున్నారు. పొలం చదును చేయడానికి రూ.2 వేలు, సాలు కొట్టడానికి రూ.2,500, విత్తనం విత్తేందుకు రూ.3 వేలు వెచ్చించాల్సి వస్తుండగా.. కూలీలకు రెండు పర్యాయాలు రూ.8 వేలు, ఎరువులకు రూ.12 వేలు, మందుల పిచికారీకి మూడు పర్యాయాలు రూ.9 వేలు అవుతున్నాయని వివరించారు. వీటితోపాటు పత్తి ఏరేందుకు అయ్యే ఖర్చు వీటికి రెట్టింపు అవుతుందంటున్నారు.

**పత్తి సాగు ఇలా.. (మండలాల వారీగా..)**

| మండలం | సాగు విస్తీర్ణం (ఎకరాల్లో..) |
|---|---|
| అమరచింత | 4,857 |
| ఆత్మకూర్ | 4,270 |
| మదనాపురం | 2,445 |
| పెద్దమందడి | 1,570 |
| ఖిల్లాఘనపురం | 1,483 |
| కొత్తకోట | 535 |
| రేవల్లి | 311 |
| గోపాల్‌పేట | 145 |
| వనపర్తి | 120 |
| పెబ్బేరు | 35 |
| ఎదుట్ల | 30 |
| చిన్నంబావి | 23 |
| పాన్‌గల్ | 4 |
| శ్రీరంగాపురం | 3 |

**అధిక వర్షాలతో ఆందోళన..**

పత్తి కాయలు కాసే సమయంలో వాటిని పట్టుకునే ఉండే గూడలు రాలుతుండటంతో కాయలు సైతం నేల రాలుతున్నాయని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అధిక వర్షాలతోనే గూడలు రాలుతున్నాయని చెబుతున్నారు.

**నివారణ ఇలా..**

ఎండు, ఆకుమచ్చ తెగులు నివారణకు వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎండు తెగులు నివారణకు లీటర్ నీటిలో 3 గ్రాముల కాపర్ క్లోరైడ్‌ను కలిపి చెట్ల మొదళ్లలో వేయడంతో నివారించే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా పూత, గూడ రాలకుండా పంటపై బోరేన్ స్ప్రే చేసుకోవాలని సూచిస్తున్నారు. థామ్ అనే రసాయనాన్ని లీటర్ నీటిలో 3 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయడంతో ఆకుమచ్చ తెగులు నివారించే వీలుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

**ఆకులు రంగు మారాయి..**



ఈసారి ఐదు ఎకరాల్లో పత్తి సాగుచేశా. ఎకరాకు రూ.35 వేల వరకు పెట్టుబడి అయింది. ఇటీవల విరివిగా కురిసిన వర్షాలకు పొలం ఊట ఎక్కి పత్తి మొక్కలు మెత్తగా మారి ఆకులు రంగు మారడంతో పాటు రాలిపోతున్నాయి. ఎండలు తీవ్రంగా ఉంటే కాస్తాయినా ఉపశమనం లభించేది.

– లక్ష్మన్న, రైతు, మద్దిగట్ల (పెద్దమందడి)

**గూడ రాలుతోంది..**



అధిక వర్షాలతో పత్తి మొక్కలకు ఉన్న పూత, గూడ, పిందెలు రాలిపోతున్నాయి. పంట సాగు చేసి మూడు నెలలు దాటింది. మరో నెల రోజులైతే చేతికొచ్చే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో గూడ రాలుతుండటంతో పెట్టిన పెట్టుబడి చేతికొస్తుందో లేదోనన్న సందేహాలు కలుగుతున్నాయి.

– విష్ణువర్ధన్ యాదవ్, రైతు, అమరచింత

**అధైర్యపడొద్దు..**



పత్తిలో గూడలు, పూత రాలడం వంటి ఘటనలతో రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదు. ఇలాంటి లక్షణాలతో పాటు ఆకు పచ్చ, అగ్గి తెగులు కనిపిస్తే మమ్మల్ని సంప్రదిస్తే నివారణకు ఏయే మందులు పిచికారీ చేయాలో క్షుణ్ణంగా వివరిస్తాం. క్లస్టర్ల పరిధిలో ఏఈఓల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైతులకు సలహాలు ఇస్తున్నాం.

– దామోదర్, ఏడీఏ



రాలిన గూడలు

# శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

- పోలీసులు గ్రామాల్లో పర్యటించాలి
- జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్



మదనాపురం ఠాణా ఆవరణలో మొక్క నాటుతున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

ఆత్మకూర్/మదనాపురం: పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా ముందుకు సాగాలని, నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకోవాలని జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆయన మదనాపురం, ఆత్మకూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఆయా ఠాణాల్లో పోలీసుల గౌరవవందనం స్వీకరించి ఆవరణలో మొక్కలు నాటారు. ఆయా ఠాణాల ఆవరణలోని వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, రిసెప్షన్, స్టేషన్ రైటర్, టెక్‌టీమ్, ఎస్‌హెచ్‌ఓ, మెన్ రెస్ట్‌రూమ్, లాకప్ గది తదితర ప్రదేశాలను పరిశీలించారు. రోజువారీగా నిర్వహిస్తున్న జనరల్ డైరీ, సెంట్రీ రిలీఫ్‌బుక్, డ్యూటీ రోస్టర్, విలేజ్ రోస్టర్, ప్రాసెస్ రిజిస్టర్, బీట్ డ్యూటీ బుక్, సస్పెక్ట్ చెక్ రిజిస్టర్, సుపీరియర్ ఆఫీసర్స్ విసిటింగ్ బుక్, ఫైనల్ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఠాణాల్లో సిబ్బందితో మాట్లాడుతూ.. బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ డయల్ 100 ఫిర్యాదులకు వెంటనే స్పందించి ఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కరించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని, జూదం, రేషన్‌బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉండాలని, గణేష్ మండపాల నిర్వాహకులు, ప్రజల సహకారంతో నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్, మదనాపురం ఎస్ఐ శేఖర్ రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# 'కేసీఆర్‌ని విమర్శిస్తే యుద్ధమే..'



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం విష ప్రచారం చేస్తోందని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శిస్తే యుద్ధం తప్పదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేసేందుకు విచారణ కమిషన్ వేసిందని ఆరోపించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో నాటి పాలకులు గోదావరి, కృష్ణా నదులపై ప్రాజెక్టులు నిర్మాణం చేయడంలో వివక్ష చూపించారని, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత మాజీ సీఎం కేసీఆర్ కృష్ణానదిపై సుమారు 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును, అదేవిధంగా గోదావరి నదిపై రికార్డుస్థాయిలో మూడేళ్ల కాలంలో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని వివరించారు. కేంద్ర జలవనరుల ఇంజినీర్లు కాళేశ్వరం సందర్శించి అద్భుతం సృష్టించారని కితాబిచ్చారని.. అన్ని అనుమతులతో ప్రాజెక్ట్ పూర్తిచేసిన కేసీఆర్ సమర్థతను తట్టుకోలేక కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారన్నారు. తన గురువు చంద్రబాబు మెప్పు కోసమే ఇలాంటి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా.. పదిశాతం మిగిలిన పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయారన్నారు. యూరియా కొరత, వరదలతో బాధపడుతున్న రైతుల కష్టాలు కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్ గౌడ్, నందిమళ్ల అశోక్, పరం జ్యోతి, గులాం ఖాదర్, మాణిక్యం పాల్గొన్నారు.

# వైఎస్సార్ సేవలు మరువలేనివి



వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తిటౌన్: వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో అమలు చేసిన పలు పథకాలు నేటికీ కొనసాగుతూ కోట్ల మంది పేదలు లబ్ధి పొందారని.. ఆయన ముందుచూపునకు ఆయా పథకాలే నిదర్శనమని కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి చీర్ల జనార్దన్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని డీసీసీ కార్యాలయం ఎదుట వైఎస్సార్ 16వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌ను, ఆయన సేవలను రెండు తెలుగు రాష్ట్రాలు ఎన్నటికీ మరువవని, ప్రజా నాయకుడిగా ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న గొప్ప ప్రజా నాయకుడని కొనియాడారు. రైతులకు ఉచిత విద్యుత్, 108, ఆరోగ్యశ్రీతో నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మైనారిటీ నార్టీఓ సయ్యద్ అక్తర్, పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు కదిరె రాములు, మైనార్టీసెల్ అధ్యక్షుడు సమద్‌మియా, పెద్దమందడి మండల అధ్యక్షుడు పెంటన్న యాదవ్, నాయకులు రాగి వేణు, అనీస్, మన్యం యాదవ్, నాగార్జున, గంధం లక్ష్మయ్య, నందిమళ్ల రాములు, రాగి అక్షయ్, ఇర్ఫాన్, అబ్దుల్లా, మునీంద్ర, ఆసిఫ్, బజార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలి



జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్

వనపర్తి: విద్యార్థులకు సైన్స్, బయోసైన్స్, గణితం, ఇంగ్లీష్‌కు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత శాతం పెంచాలని కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఫేస్ రికగ్నేషన్ సిస్టం పనితీరును మండల విద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు మొదటగా ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు నమోదు చేయాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా అపా కార్డుల నమోదు ఎంత జరిగిందని విద్యాశాఖ అధికారుల నుంచి నివేదిక తీసుకొని పరిశీలించారు. 55 వేల మంది విద్యార్థులు అర్హులుగా ఉన్నప్పటికీ.. నమోదు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు 54 శాతం జరిగిందని, ఇంకా పెంచాలని సూచించారు. అలాగే నిర్వహించిన ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ) తరగతులపై విద్యార్థుల అభిప్రాయాలతో పాటు తరగతులు ఎలా నడుస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. యూనిఫాంల కొరత ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. సమీక్షలో జిల్లా విద్యాధికారి మహమ్మద్ ఘనీ, ఏపీఓ నరేందర్‌రెడ్డి, ఆయా మండలాల ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

**గుణాత్మక విద్య అందించాలి..**

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.31 లక్షలు ఉన్నాయని.. వెంటనే పనులు ప్రారంభించాలని ఏఈని ఆదేశించారు. ప్రస్తుతానికి బాలభవన్ భవనాన్ని కూడా తాత్కాలికంగా తరగతి గదులుగా వాడుకోవాలని సూచించారు. 10వ తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. సామాన్య శాస్త్రం, గణిత శాస్త్రం విద్యను బాగా నేర్చుకునేందుకు ఖాన్ అకాడమీ తరగతులు విద్యార్థులకు అందించాలని ప్రధానోపాధ్యాయురాలిని ఆదేశించారు. పాఠశాలలో ఇప్పటికే కంప్యూటర్లు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామని విద్యార్థులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలభవన్‌లో నాట్య శిక్షణ పొందుతున్న విద్యార్థులను చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఏ వయసు పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలు నేర్పిస్తారు, ఏయే సమయాల్లో నేర్పిస్తారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన నటరాజ విగ్రహం వద్ద దీపం వెలిగించి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులతో ఫొటో దిగారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘనీ, ఏఎంఓ మహానంది, మండల విద్యాధికారి మద్దిలేటి, ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి ఉన్నారు.

# అన్నదాతల యూరియా అవస్థలు

ఖిల్లాఘనపురం/పాన్‌గల్/వీపనగండ్ల/గోపాల్‌పేట/ఆత్మకూర్/అమరచింత: జిల్లా రైతులను యూరియా కష్టాలు వీడటం లేదు. రోజువారీగానే మంగళవారం కూడా ఆయా పీఏసీఎస్‌లు, సింగిల్ విండోల ఎదుట పట్టాదారు పాసుపుస్తకాలు, చెప్పుల వరుసలు కనిపించాయి.

■ రైతులకు యూరియా అందించాలంటూ పలువురు రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఖిల్లాఘనపురంలోని వనపర్తి–మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై కమాన్ దగ్గర బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, మాజీ జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో ఏనాడు రైతులు యూరియా కోసం ఇబ్బంది పడలేదన్నారు. ప్రస్తుతం రోజు ఒక్కో రైతుకు రెండు బస్తాల యూరియా ఇస్తుండటంతో ఏం చేయాలో అర్థంగాక ఆందోళన చెందుతున్నారని చెప్పారు. తెల్లవారేసరికి భార్యాభర్తలు సింగిల్‌విండో కార్యాలయం దగ్గరకు వచ్చి యూరియా కోసం కుస్తీ పడుతున్నారని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి మల్లయ్య, ఎస్ఐ వెంకటేష్ అక్కడకు వచ్చి వారితో మాట్లాడారు. రైతులకు సరిపడా యూరియా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఆందోళనతో కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి.

**అసమర్థ ప్రభుత్వం : మాజీ వ్యవసాయశాఖ మంత్రి**

అన్నదాతలకు సకాలంలో యూరియా అందించలేని అసమర్థ పాలన రాష్ట్రంలో కొనసాగుతుందని రాష్ట్ర మాజీ వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఖిల్లాఘనపురం మండలానికి వచ్చిన ఆయన రోడ్డుపై వెళ్తూ సింగిల్‌విండో దగ్గర రైతులను చూసి వారితో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరోజు యూరియా కొరత తలెత్తలేదన్నారు. ప్రస్తుతం సకాలంలో యూరియా అందించకపోవడంతో దిగుబడి తగ్గే ప్రమాదం ఉందన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఎందుకు తెచ్చుకున్నామా అని రైతులు బాధపడుతున్నారని చెప్పారు.

■ వీపనగండ్ల మండలం తూంకుంట సింగిల్‌విండో సిబ్బంది తమ వద్ద ఆధార్‌కార్డు జిరాక్స్‌లను తీసుకొని యూరియా ఇవ్వడం లేదని.. ఎప్పుడిస్తారని ప్రశ్నిస్తే స్టాక్ రాలేదని సమాధానమిస్తున్నారని పలువురు రైతులు తెలిపారు. ఈ విషయమై సింగిల్‌విండో సీఈఓ రాము స్పందిస్తూ ఆధార్ కార్డులు తీసుకుంటున్నామని, స్టాక్ వచ్చినప్పుడు సరఫరా చేస్తామని, అంతవరకు వేచి చూడాలని సమాధానమిచ్చారు. మండల కేంద్రంలోని దుకాణదారులు యూరియా బస్తాలతో పాటు గుళికల మందును అంటగడుతున్నారని రైతులు తెలిపారు. ఈ విషయమై తగిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ సమాధానమిచ్చారు.



గోపాల్‌పేట పీఏసీఎస్ వద్ద పట్టాదారు పాసు పుస్తకాల జిరాక్సు ప్రతులను వరుసలో ఉంచిన రైతులు



ఖిల్లాఘనపురం సింగిల్‌విండో కార్యాలయం దగ్గర రైతుల పడిగాపులు

■ మంగళవారం గోపాల్‌పేట పీఏసీఎస్ వద్ద రైతులు పట్టాదారు పాసు పుస్తకాల జిరాక్సు కాపీలను వరుసలో పెట్టడం కనిపించింది.

■ అమరచింత అగ్రో రైతు సేవాకేంద్రానికి మంగళవారం 900 సంచుల యూరియా రావడంతో సోమవారం ఇచ్చిన టోకన్లతో పాటు మంగళవారం వచ్చిన రైతులకు పంపిణీ చేసేందుకు వ్యవసాయ శాఖ, పీఏసీఎస్ అధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎస్ఐ స్వాతి సిబ్బందితో రైతులను క్యూలో నిల్చోబెట్టి టోకన్ల వారీగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నారు. యూరియా అందని రైతులు అధికసంఖ్యలో ఉండటంతో బుధవారం ఇచ్చేందుకుగాను ఎస్ఐ దగ్గరుండి టోకన్లు ఇప్పించి తిప్పిపంపారు.

■ ఆత్మకూర్ పీఏసీఎస్ వద్ద మంగళవారం ఉదయం రైతులు చెప్పులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు వరుస క్రమంలో పెట్టి పడిగాపులు కాశారు. 800 బస్తాల యూరియా రాగా.. పోలీసులు రైతులను వరుస క్రమంలో నిల్చోబెట్టి రాత్రి 7.30 వరకు పంపిణీ చేసి మిగిలిన వారికి టోకెన్లు అందించారు.



ఆత్మకూర్ పీఏసీఎస్ వద్ద ఇలా..

■ పాన్‌గల్ సింగిల్‌విండో కార్యాలయానికి 1,350 బస్తాల యూరియా వచ్చిందనే విషయం తెలుసుకున్న వివిధ గ్రామాల రైతులు మంగళవారం పెద్ద సంఖ్యలో తరలివచ్చి బారులు తీరి నిలబడ్డారు. రెండ్రోజుల కిందట రైతులకు ఇచ్చిన టోకన్లకు ముందుగా యూరియా అందజేసి ఆ తర్వాత టోకన్లు లేని వారికి పంపిణీ చేస్తామని సింగిల్‌విండో అధికారులు పేర్కొన్నారు. యూరియా దొరకని రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. పలువురు కార్యాలయంలోకి చొచ్చుకెళ్లి గందరగోళం సృష్టించడంతో అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకొని అధికారులు, రైతులకు సర్దిచెప్పి యూరియా అందించాలని సూచించారు.



పాన్‌గల్ సింగిల్‌విండో కార్యాలయం ఎదుట రైతులు

## క్లుప్తంగా

### స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి


తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు వెంటనే స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, భరత్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.8 వేల కోట్ల వరకు స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. చాలా మంది పేద విద్యార్థులు స్కాలర్‌షిప్‌పై ఆధార పడిచదువుతున్నారని, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చాలా మంది విద్యార్థులు విద్యకు దూరం అవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి స్కాలర్‌షిప్‌లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా గురుకులాలకు సొంత భవనాలు, కేజీబీవీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఏఎన్‌ఎం పోస్టులను భర్తీ చేయాలని, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అందించి, అధ్యాపక, ఎంటీఓ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీనాథ్, రమేష్, ఈశ్వర్, సాయి, మణికంఠ, హేమలత, జ్ఞాపిక తదితరులు పాల్గొన్నారు.

### పట్టపగలే ఇంట్లో చోరీ

ధన్వాడ: మండలంలోని ఎమ్మెనోనిపల్లిలో ఓ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. ఎమ్మెనోనిపల్లికి చెందిన కావలి నర్సింహులు మంగళవారం ఇంటికి తాళంవేసి.. కుటుంబ సభ్యులతో కలిసి ఊట్కూర్‌కు వెళ్లాడు. తిరిగి సాయంత్రం వచ్చి చూడగా.. తలుపులు ధ్వంసమై కనిపించాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా.. వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉన్నాయి. ఇంట్లో ఉంచిన రూ. 10లక్షల నగదు, 2 తులాల బంగారం, 50 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. 10రోజుల క్రితం పొలం విక్రయించగా వచ్చిన సొమ్మును ఇంట్లో పెట్టినట్లు తెలిపారు. కాగా, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

### ఫోన్ కొనివ్వలేదని.. కృష్ణానదిలో దూకాడు

- యువకుడి ఆత్మహత్యాయత్నం
- ప్రాణాలు కాపాడిన పోలీసులు


ఉషెనప్ప

కృష్ణా: మొబైల్ ఫోన్ కొనివ్వలేదని కృష్ణానదిలో దూకి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన రాష్ట్ర సరిహద్దులో మంగళవారం చోటు చేసుకుంది. పూర్తి వివరాలు.. రాయచూర్ జిల్లా గుంజల్లి గ్రామానికి చెందిన ఉషెనప్ప(22) కొంత కాలంగా ఫోన్ కొనివ్వడం లేదని తన తల్లితో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి మండల పరిధిలోని బ్రిడ్జి వద్దకు చేరుకొని నదిలోకి దూకాడు. స్పందించిన స్థానికులు శక్తినగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడిని రక్షించి రాయచూర్ రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ విషయమై శక్తినగర్ ఎస్‌ఐ నారాయణను వివరణ కోరగా ఫోన్ ఇప్పించాలని ఇంట్లో తల్లితో గొడవపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. యువకుడికి ఇటీవల వివాహం జరిగినట్లు పేర్కొన్నారు.

# కాంగ్రెస్ బాంబు తుస్సుమంది


మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

- కాళేశ్వరం అవినీతిని వెలికితీయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం
- కవిత రాజకీయ జిమ్మిక్కులు చేస్తోంది: ఎంపీ డీకే అరుణ

పాలమూరు: అంతా.. ఇంతా అంటూ గొప్పలు చెప్పి ఇప్పుడు చేసేదేమి లేక సీబీఐ విచారణ అంటున్నారని, కాళేశ్వరం నిర్మాణంలో జరిగిన అవినీతిని వెలికితీయడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ఆపార్టీ వ్యవహారం చూస్తుంటే అవినీతికి పాల్పడిన వాళ్లను కాపాడుతున్నట్లు ఉందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు ఆరోపించారు. కాంగ్రెస్ బాంబు పేలలేదని, కాంగ్రెస్ చెప్పే ఏ బాంబు అయినా ఇలాగే తుస్సు మంటుందన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత మొత్తం సొమ్ము కక్కిస్తామని చెప్పిన మాటలు ఎక్కడపోయాయని విమర్శించారు. విచారణ కమిటీ రిపోర్ట్ నివేదికలు అంటూ తాత్సరం చేసి ఇప్పుడు అర్ధరాత్రి వరకు సభ ఏర్పాటు చేసి 20 నెలల తర్వాత సీబీఐ విచారణ అంటున్నారన్నారు. 'మీరు వేసిన కమిషన్ మీద మీకు నమ్మకం లేదా? మీ మీద మీకు నమ్మకం లేదా..' అంటూ హేళన చేశారు. ఆ కమిటీ నివేదిక ద్వారా ఏం తేల్చారని, ఎవరిని దోషులుగా చూపారో ఎందుకు బయటపెట్టాలేదని ప్రశ్నించారు. కమిటీ సూచనల ప్రకారం నిందితులపై ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. దొంగలు దొంగలు గట్టు పంచుకున్నట్లు, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందు దొందుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కాళేశ్వరం విషయంలో ఎమ్మెల్సీ కవిత డైలాగ్స్ చెబుతోందని, కాళేశ్వరంలో అవినీతి జరిగిందని స్వయంగా కవిత ఒప్పుకోవడం జరిగిందన్నారు. కానీ ఆ అవినీతిలో కేసీఆర్‌కు సంబంధం లేదంటూ చెప్పడం.. ఇదేక్కడి చోద్యం అన్నారు.ఈ రాష్ట్రాన్ని పదేళ్లు పాలించింది వాళ్ల కుటుంబమే కదా, కాళేశ్వరం అవినీతిలో కేసీఆర్ కుటుంబసభ్యులు అందరికీ సంబంధం ఉందన్నారు. కవిత రాజకీయ జిమ్మిక్కులు చేస్తోందని, పదేళ్లు వన్‌సైడ్ రాజకీయం చేసిన కేసీఆర్‌కు ఇందులో భాగస్వామ్యం లేదని చెప్పాడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

■ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్లే యూరియా కొరత ఏర్పడి రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. సక్రమంగా మానిటరింగ్ చేయలేకపోవడంతో బ్లాక్ మార్కెట్‌కు వెళ్తుందన్నారు. వారి వైఫల్యం చెప్పుకోలేక కేంద్రం ఇవ్వలేదని బట్టకాల్చి వేస్తున్నారని ఎంపీ విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నేతలు పద్మజారెడ్డి, పడకుల బాలరాజు, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఎంపీ డీకే అరుణ హాజరై మాట్లాడారు. ఈనెల 17నుంచి అక్టోబర్ 2 వరకు ఎంపీ, ఎమ్మెల్యేలు నేతలు కార్యకర్తలు అందరూ వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందే అవకాశాలు ఎక్కువగా ఉన్న క్రమంలో ప్రజలను కలుస్తూ కేంద్ర సంక్షేమ కార్యక్రమాలను వివరించాలన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో విజయం సాధిస్తే రాబోయో అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని తెలిపారు.

# అమృత్ భారత్ స్కీం పనుల్లో వేగం పెంచాలి


గద్వాల రైల్వే స్టేషన్ ఆవరణలో పనులు పరిశీలిస్తున్న డీఆర్‌ఎం సంతోష్‌కుమార్ వర్మ

డీఆర్‌ఎం సంతోష్‌కుమార్ వర్మ

గద్వాల న్యూటౌన్/స్టేషన్ మహబూబ్‌నగర్/అలంపూర్: మహబూబ్‌నగర్, గద్వాల రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ స్కీం కింద చేపడుతున్న పనులను వేగంగా పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ సంతోష్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన గద్వాల రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. ప్రత్యేక రైలులో వచ్చిన డీఆర్‌ఎం వస్తూనే రైల్వేట్రాక్‌ను చూసి, పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అధికారులతో కలిసి స్టేషన్, ప్లాట్‌ఫాం విస్తీర్ణం, ఆర్చి, వెహికిల్ పార్కింగ్, రోడ్ల పనులను పరిశీలించారు. ఆవరణలో మొక్కలు నాటారు. క్రూలాబీ (ట్రెన్ మేనేజర్ల రెస్ట్‌రూం) తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ భారత్ స్కీం కింద చేపడుతున్న పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన నూతనంగా నిర్మించిన రైల్వే ఆఫీసర్ల రెస్ట్ హౌస్‌ను ప్రారంభించారు. డీఆర్‌ఎం వెంట రైల్వే డివిజనల్ ఇంజినీర్ అరుణ్‌కుమార్ శర్మ, డివిజనల్ ఎలక్ట్రిక్ ఇంజినీర్ కిరణ్‌కుమార్, డివిజనల్ సిగ్నల్ టెలికాం ఇంజినీర్ సృజన్‌కుమార్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సురేష్‌కుమార్ ఉన్నారు.

**జోగుళాంబ రైల్వే హాల్ట్ పరిశీలన**

జోగుళాంబ రైల్వే హాల్ట్ పనులను సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్‌ఎం సంతోష్‌కుమార్ శర్మ పరిశీలించారు. రైల్వే స్టేషన్‌లో విశ్రాంతి, స్టేషన్ గదులను, హై లెవల్ ప్లాట్‌ఫాం, షెడ్డు పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జోగుళాంబ అమ్మవారి దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ఖాళీలు భర్తీ చేయాలని వినతి**

గద్వాల ఇంజినీరింగ్ పీవే సెక్షన్ బైఫర్‌కేషన్ వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ అసిస్టెంట్ డివిజనల్ సెక్రెటరీ రైల్వేశంకర్ డీఆర్‌ఎంకు వినతిపత్రం అందించారు. సిగ్నల్ అండ్ టెలికాం డిపార్ట్‌మెంట్లలో టెక్నీషియన్, హెల్పర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. స్టేషన్ మాస్టర్లను నియమించాలని, ప్రస్తుతం ఉన్న ఎలక్ట్రికల్ భవనం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలని వినతిపత్రంలో కోరారు.

## మానసిక దివ్యాంగులను మనసుతో చూడాలి


మానసిక దివ్యాంగుడితో మాట్లాడుతున్న జడ్జి ఇందిర

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర

మహబూబ్‌నగర్ రూరల్: మానసిక దివ్యాంగులను మనసుతో చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర అన్నారు. జిల్లా కేంద్రం టీచర్స్ కాలనీలోని బ్రహ్మ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలను జడ్జి సందర్శించి న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో వసతి సౌకర్యాలు ఎలా ఉన్నాయో పరిశీలించారు. అన్ని సదుపాయాలు అందుతున్నాయా లేవా అని పాఠశాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వారి ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. దివ్యాంగుల తల్లిదండ్రులకు వైకల్యం ఉన్న పిల్లలను ఉత్సాహం, ధైర్యం కలిగించడం కోసం లీగల్ సర్వీసెస్ యూనిట్ ఫర్ మనోన్యాయ, దివ్యాంగస్ కౌశల్ వికాస్, దివ్యాంగస్ రోజ్‌గార్ సేతు వంటి స్కీం అందుబాటులో ఉన్నాయన్నారు. బ్రహ్మ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల మానసిక దివ్యాంగులకు ఒక ఆలయం లాంటిదన్నారు. ఇక్కడి పిల్లలు విద్యాబుద్ధులతో పాటు ఒకేషనల్, కంప్యూటర్ శిక్షణ మొదలగునవి పొందుతున్నారని, రోజువారి దినచర్యలో చేపట్టే కార్యక్రమాలు, ఫిజియోథెరపి, స్పీచ్‌థెరపి, బిహేవర్ మోడిఫికేషన్ చేస్తున్నారని తెలిపారు. వీటిద్వారా మానసిక దివ్యాంగులు సెరిబ్రల్ పాలసీ చిల్డ్రన్స్ ఫిజియోథెరపి ద్వారా ప్రయోజనం పొందుతున్నారని చెప్పారు. ఈ విధమైన శిక్షణ ఇవ్వడం ద్వారా పిల్లల్లో మనోధైర్యంతోపాటు తెలివితేటలు కూడా మెరుగుపడుతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు గన్నోజు చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ


టోర్నమెంట్ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ (అండర్-13 )బ్యాడ్మింటన్ టోర్నమెంట్ బ్రోచర్లను జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ 4వ తేదీన క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు, 5 నుంచి మెయిన్‌డ్రా పోటీలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌గౌడ్, ఎల్.రవికుమార్, సంయుక్త కార్యదర్శులు నాగరాజుగౌడ్, ఉదయ్, భాను ప్రకాశ్, సభ్యులు సతీష్ పాల్గొన్నారు.

# పీయూలో హెచ్‌ఓడీల నియామకం


ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ మాలవికి నియామక పత్రం అందజేస్తున్న వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో పలు డిపార్ట్‌మెంట్లకు సంబంధించి హెచ్‌ఓడీలను నియమిస్తూ మంగళవారం వీసీ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. కెమిస్ట్రీ హెచ్‌ఓడీగా విజయలక్ష్మి, ఫిజిక్స్ హెచ్‌ఓడీగా అంకం భాస్కర్, పొలిటికల్ సైన్స్ హెచ్‌ఓడీగా కుమారస్వామి, ఇంగ్లిష్ హెచ్‌ఓడీగా మాలవి, మైక్రో బయోలజీ హెచ్‌ఓడీగా మధుసూదన్‌రెడ్డిని ఫాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ డీన్‌గా ఓయూ అధ్యాపకుడు ఎం.రాములును, ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డీన్‌గా కృష్ణచైతన్య, ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్‌గా రామకృష్ణను నియమించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉధృతి తగ్గని డిండి ప్రాజెక్టు


అలుగు పారుతున్న డిండి ప్రాజెక్టు

- దుందుభీలో కొనసాగుతున్న వరద

ఉప్పునుంతల: ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదతో దుందుభీ వాగులో వరద ప్రవాహం కొనసాగుతోంది. మండల సరిహద్దులోని డిండి ప్రాజెక్టు అలుగు ఉధృతి తగ్గడం లేదు. అలుగుతో పాటు ప్రాజెక్టు ఎడమ, కుడి కాల్వ ద్వారా నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. చెరువు కట్ట కింద ప్రాజెక్టు అలుగు వద్ద చేపల వ్యాపారం జోరుగా సాగుతుంది.


తిర్మలాపూర్- చింతపల్లి బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ వాగు

# జూరాలకు తగ్గిన వరద


జూరాల నుంచి దిగువకు పారుతున్న వరద


మూసేసిన శ్రీశైలం గేట్లు

**10 క్రస్ట్ గేట్లు పైకెత్తి దిగువకు నీటి విడుదల**

ధరూరు/ఆత్మకూర్/మదనాపురం: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద క్రమంగా తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం 1,56,615 క్యూసెక్కులు ఉండగా... మంగళవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో 1.26 లక్షలకు తగ్గినట్లు చెప్పారు. దీంతో ప్రాజెక్టు 10 క్రస్ట్‌గేట్లను పైకెత్తి 69,630 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 36,674 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, ఆవిరి రూపంలో 67, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 500, భీమా లిఫ్టుకు 750 క్యూసెక్కులు వినియోగించినట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.048 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

**కొనసాగుతున్న విద్యుదుత్పత్తి..**

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో మంగళవారం ఉత్పత్తి కొనసాగినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, 272.587 మి.యూ, దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 299.688 మి.యూ. విద్యుదుత్పత్తి జరిగిందన్నారు. రెండు కేంద్రాల్లో ఇప్పటి వరకు 572.275 మి.యూ. ఉత్పత్తి చేపట్టినట్లు వివరించారు.

**రామన్‌పాడులో 1,020 అడుగులు..**

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళవారం సముద్రమట్టానికి పైన 1,020 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు అధికారులు తెలిపారు. జూరాల ఎడమ కాల్వ ద్వారా 798 క్యూసెక్కుల వరద కొనసాగుతుండగా.. సమాంతర కాల్వలో సరఫరా లేదన్నారు. జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 875 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 55 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 763 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగించినట్లు చెప్పారు.

### శ్రీశైలం గేట్లు మూసివేత

దోమలపెంట: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో మంగళవారం సాయంత్రం గేట్లన్నీ మూసివేశారు. సాయంత్రం వరకు మూడు గేట్లు తెరిచి దిగువన నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేశారు. జూరాల ఆనకట్ట స్పిల్‌వే నుంచి 69,630, విద్యుదుత్పత్తి చేస్తూ 36,674, సుంకేసుల నుంచి 71,519 క్యూసెక్కుల ప్రవాహం శ్రీశైలం జలాశయానికి చేరింది. ప్రస్తుతం జలాశయంలో 881.8 అడుగుల నీటిమట్టం, 197.9120 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడుకు 28,500, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,817, ఎంజీకేఎల్‌ఐకు 417 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.758 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 15.152 మి.యూ. విద్యుదుత్పత్తి చేశారు.

### సుంకేసుల 17 గేట్లు తెరిచి..

రాజోళి: సుంకేసుల జలాశయానికి వరద మంగళవారం భారీగా పెరిగింది. దీంతో 17 గేట్లను ఒక మీటర్ మేర తెరిచి దిగువకు నీటిని విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ఎగువ నుంచి 75 వేల క్యూసెక్కులు రాగా.. 71,519 క్యూసెక్కులు దిగువకు, 2,095 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు వదిలామన్నారు.

## పోక్సో కేసు నమోదు

చిన్నంబావి: బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన ఘటనలో యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపిన వివరాలు.. మండలంలోని పెద్దదగడ గ్రామానికి చెందిన సురేష్ అదే గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికపై గత నెల 27న అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులు మంగళవారం ఫిర్యాదు చేయగా యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.



## భాషా పండితుల పాత్ర కీలకం: ఎమ్మెల్యే


ఉపాధ్యాయులకు జ్ఞాపికలను అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో భాషాపండిత్‌ల పాత్ర కీలకమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక బీకేరెడ్డి కాలనీలోని మహబూబ్‌నగర్ ఫస్ట్-నవరత్నాలు శిక్షణ కేంద్రంలో రెండోరోజు మంగళవారం ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాథ్స్, సైన్స్, బయాలజీ, సోషల్ స్టడీస్ సబ్జెక్టులలో పట్టు సాధించేందుకు ల్యాంగ్వేజెస్ ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. వీటి ద్వారా ఇతర సబ్జెక్టులను సులభంగా అర్థం చేసుకోవచ్చన్నారు. 'శత శాతం'తో పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్స్ తగ్గాయని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు చేయాలని, ముఖ్యంగా స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రిజిస్టర్ (ఎస్‌ఐఆర్) నిర్వహించాలన్నారు. అనంతరం ఇక్కడి ఆవరణలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డీఈఓ ప్రవీణ్‌కుమార్, సీఎంఓ బాలుయాదవ్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్, మహబూబ్‌నగర్ ఫస్ట్ కేంద్రం ఇన్‌చార్జ్ నిజలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

### డిమాండ్ లేఖలపై చెల్లింపులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల హయ్యర్ పెన్షన్ అమలు కోసం అందిన డిమాండ్ లేఖలననుసరించి డీడీల రూపంలో డబ్బులు చెల్లించిన వారికి ఈ నెలలో హయ్యర్ పెన్షన్ అమలు జరపనున్నట్లు ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు రాజసింహుడు, జీబీపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సోమవారం తమ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు హైదరాబాద్‌లోని బర్కత్‌పుర పీఎఫ్ కార్యాలయంలో కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌లను కలిసి డిమాండ్ లేఖలపై డబ్బులు చెల్లించిన, ఏరియర్స్ రానివారి విశ్రాంత ఉద్యోగుల జాబితాను అందజేసినట్లు వివరించారు.

## రేపు మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి విగ్రహావిష్కరణ

- హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్


మాట్లాడుతున్న టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టత, ఈ ప్రాంత అభివృద్ధి కోసం దివంగత మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థిదశ నుంచి రాష్ట్ర, జిల్లా రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. టీడీపీ హయాంలో ఈ ప్రాంతంలో సాగు, తాగునీటి కోసం ఎన్నో ఉద్యమాలు చేశారని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం పార్టీకి చెందిన ఇతర నాయకులతో కలిసి కొల్లాపూర్ నుంచి నారాయణపేట, అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్రలు చేసినట్లు తెలిపారు. ఈనెల 4న గురువారం జిల్లా కేంద్రం పద్మావతీకాలనీలోని గ్రీన్‌బెల్టులో మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నాయకులు సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్, సిరాజ్‌ఖాద్రీ, రాజేందర్‌రెడ్డి, గోపాల్ యాదవ్, జహీర్ అఖ్తర్, లింగం నాయక్, అజ్మత్ అలీ తదితరులు పాల్గొన్నారు.